సామాన్యులు ఉత్సాహంగా జరుపుకునే సంక్రాంతి పండగపై ధరల పిడుగు పడింది. పప్పులు, నూనెల ధరలు గత ఆరు నెలలతో పోల్చితే భారీగా పెరిగిపోవడంతో ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. పండగ ఎలా చేసుకోవాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. ఎన్నికల సమయంలో హామీలతో ఉదరగొట్టిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా గాలికి వదిలేశారు. ఒక్క సంక్షేమ పథకమూ అమలు చేయకపోవడంతో సామాన్యులకు ఆర్థిక భరోసా కొరవడింది. ధరలనూ నియంత్రించకపోవడంతో పాలకులపై ప్రజలు మండిపడుతున్నారు. భారీగా పెరిగిన ధరలతో పండగ చేసుకునేదెలా అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంక్రాంతి వేళ పిండి వంటల మాట దేవుడెరుగు... సాధారణ భోజనం చేయడమూ కష్టంగా మారిందవి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సంక్రాంతికి ధరల పోటు

పప్పులు కుతకుత... నూనెలు సలసల

- ధరల పెరుగుదలతో సామాన్యులకు భారంగా పండగ
- ఆరు నెలల్లోనే లీటర్ నూనెపై రూ.50 పెరుగుదల
- అదే బాటలో పరుగులు తీస్తున్న పప్పులు, ఇతర వస్తువులు
- ధరల నియంత్రణలో కూటమి పాలకులు పూర్తిగా విఫలం
- పండగ వేళ విలవిల్లాడుతున్న సామాన్య ప్రజానీకం



ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు (కిలోల్లో)

కందిపప్పు మొదటి రకం రూ.175	మినప పప్పు రూ.175
మినప గుళ్లు రూ.215	పెసర పప్పు రూ.140
శనగ పలుకులు రూ.160	బెల్లం రూ.70
సన్‌ఫ్లవర్ వంట నూనె రూ.150	



కిరణా దుకాణాల్లో సంక్రాంతి సరకులు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

ఏడాదిగా నూనె ధరల పెరుగుదల ఇలా...

నూనెల రకాల	2024 జనవరి	2024 సెప్టెంబర్	2025 జనవరి
	లీటరు - 15 లీటర్ల డబ్బా	లీటరు - 15లీటర్ల డబ్బా	లీటరు - 15లీటర్ల డబ్బా
పామాయిల్	రూ.90 - రూ.1250	రూ.110 - రూ.1550	రూ.135 - రూ.2000
సన్‌ఫ్లవర్	రూ.100 - రూ.1550	రూ.123 - రూ.1950	రూ.150 - రూ.2200
రైస్ బ్రాన్	రూ.125- -----	రూ.140 ------	రూ.145 ------

కంచరపాలెం: వంటలకు రుచి వచ్చేది కమ్మని నూనెతోనే. అయితే ఆ వంట నూనెల ధరలు చుక్కలను తాకడంతో సామాన్యులు వాటిని అందుకోలేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గతేడాదితో పోలిస్తే మార్కెట్‌లో నూనె ధరలు లీటరుకు రూ.25 నుంచి రూ.50 వరకు పెరిగాయి. ఇప్పటికే కూటమి పాలకులు విద్యుత్ చార్జీలు మోత మోగించి సామాన్యుల నడ్డి విరిచేశారు. ఇంతలో సంక్రాంతి పండగ వేళ నూనె ధరల మంటలతో వినియోగదారులు సలసల కాగిపోతున్నారు. స్వీట్లు, హోటళ్లు, హాస్టల్ యాజమానులు మెనూలో ధరలను అమాంతం పెంచేస్తున్నారు. పప్పుల ధరలు సైతం భారీగా పెరిగిపోయాయి. దీంతో పిండి వంటలు వండుకునేదెలా అని ప్రజలు భయపడుతున్నారు.

ఆరు నెలల్లోనే పైపైకి ధరలు

గతేడాది చివరిలో కేంద్ర ప్రభుత్వం సన్ ఫ్లవర్, సోయాబీన్, పామాయిల్ తదితర నూనెలపై దిగుమతి సుంకాలను 5.5 నుంచి 27.5 శాతానికి పెంచడంతో క్రమేణా ధరలు పెరుగుతూ వచ్చాయి. దిగుమతి సుంకాలు తగ్గిస్తే తప్ప నూనెల ధరలు దిగిరావని వ్యాపారులు అంటున్నారు. లీటర్ ప్యాకెట్‌తోపాటు 15 లీటర్ల డబ్బాలపై ధరలు పెరుగుతూ వినియోగదారులతో దోబూచులాడుతున్నాయి. ప్రస్తుతం సంక్రాంతి కారణంగా వీటి ధరలు మరింతగా పెరగవచ్చని భావిస్తున్నారు. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో వినియోగదారులకు నెలకు 800 టన్నుల వరకు నూనె అవసరం ఉంటుంది. ప్రస్తుతం సంక్రాంతి పండగ నేపథ్యంలో పిండి వంటల కారణంగా ఈ వినియోగం మూడింతలు పెరిగే అవకాశముందని అంచనా. మరోవైపు ఏడాది కాలంగా వినియోగదారుల నుంచి డబ్బు వసూలు చేసే పప్పుల చీటీల నిర్వాహకులు ధరల పెరుగుదలతో హడలిపోతున్నారు. మొదటిలో ఇచ్చిన హామీ మేరకు సరకులు ఇస్తే భారీగా నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు. కొంత మంది సరకులు తగ్గిస్తామంటుండగా... మరికొంత మంది బ్రాండ్‌లు మార్చి సరకులు ఇస్తున్నారు. మరోవైపు నియోజకవర్గంలోని రైతు బజారుల్లో పామాయిల్ విక్రయిస్తున్నా వినియోగదారులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు.



నూనె దుకాణం వద్ద మహిళలు

పండగ వేళ ఆందోళనగా ఉంది



పెరిగిన ధరలతో ఈ ఏడాది సంక్రాంతి పండగ ఎలా చేసుకోవాలో అర్థంకాక ఆందోళనగా ఉంది. మాది మధ్య తరగతి కుటుంబం. నెలకు 4 ప్యాకెట్ల నూనె వినియోగిస్తాం. ప్రస్తుతం పండగ నెల కావడంతో వాడకం రెట్టింపు అవుతుంది. భారీగా పెరిగిన ధరలతో నూనె కొనుగోలు చేసి పిండి వంటలు వండుకునే పరిస్థితి లేదు.

– యల్లపు ఝాన్సీ, ఊర్వశి కూడలి, కంచరపాలెం

ధరలు నియంత్రించాలి



నూనెల ధరలు తగ్గుతాయని వేచి చూస్తున్న కొద్దీ పెరుగుతూనే ఉన్నాయి. సంక్రాంతి పండగ కూడా తోడవడంతో వ్యాపారులు నూనెను బ్లాక్ చేసే అవకాశం ఉంది. ప్రభుత్వం ధరలైనా తగ్గించాలి, బ్లాక్ మార్కెటింగ్ అయినా అరికట్టాలి. ధరల నియంత్రణకు ప్రభుత్వమే చర్యలు చేపట్టాలి.

– కాయిత రత్నాకర్, వినియోగదారుడు, కంచరపాలెం

సబ్సిడీపై సరఫరా చేయాలి



సంక్రాంతి పండగను దృష్టిలో పెట్టుకుని వంట నూనెను రేషన్ డిపోల ద్వారా సబ్సిడీ ధరలపై ప్రభుత్వం సరఫరా చేయాలి. లేదంటే మార్కెట్‌లో నూనె కొనుక్కుని పిండి వంటలు వండుకోవాలంటే సామాన్యులకు సాధ్యం కాదు. భారీగా పెరిగిన ధరలతో సామాన్యులు పండగ చేసుకునే పరిస్థితి లేదు.

– పి.సుజాత, ఐటీఐ జంక్షన్, కంచరపాలెం

క్లుప్తంగా

చురుగ్గా డ్రెయిన్ నిర్మాణ పనులు



లలితానగర్‌లో డ్రెయిన్ నిర్మాణ పనులు చేస్తున్న సిబ్బంది

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు అక్కయ్యపాలెం లలితానగర్‌లో డ్రెయిన్ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. సాక్షి రోడ్, పెట్రోల్ బంకు పక్కన ఆనుకుని ఉన్న రహదారుల్లో డ్రెయిన్ గట్లు శిథిలమవడం, పూడికలతో నిండిపోవడంతో మురుగు నీరు ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడడంతో పాత డ్రెయిన్లు తొలగించి కొత్తగా నిర్మిస్తున్నారు. కొంత మంది ఇళ్ల ముందు స్లాబులు నిర్మించడంతో డ్రెయిన్‌లో చెత్త తొలగించడానికి వీలులేక పారిశుద్ధ్య సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. చెత్త తొలగించడానికి వీలుగా డ్రెయిన్‌పై గ్రిల్స్, మ్యాన్ హోల్స్ ఏర్పాటు చేసుకోవాలని పారిశుద్ధ్య సిబ్బంది సూచించారు.

లావణ్య కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



లావణ్య భర్త సతీష్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, ఉషశ్రీ

సీతంపేట: తిరుపతిలో వైకుంఠ ఏకాదశి టిక్కెట్ల క్యూలైన్‌లో జరిగిన తొక్కిసలాటలో మరణించిన సూరిశెట్టి లావణ్య కుటుంబాన్ని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు, వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ గురువారం పరామర్శించారు. 43వ వార్డు వేంకటేశ్వర కాలనీలో మృతురాలి ఇంటికి వెళ్లి ఆమె భర్త సతీష్‌తో మాట్లాడి ధైర్యం చెప్పారు. లావణ్య మృతదేహం విశాఖకు తీసుకురావడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు చెప్పారు. ఎమ్మెల్యే కుమార్తె శ్యామల దీపిక, టీడీపీ వార్డు అధ్యక్షుడు బొడ్డేటి మోహన్ పరామర్శించారు.

మిలీనియం సొల్యూషన్స్‌లో 18న క్యాంపస్ డ్రైవ్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వరద రవికుమార్, తదితరులు

సీతమ్మధార: మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో జనవరి 18న క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సెంట్రల్ మేనేజర్ వరద రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు సిబ్బంది గురువారం క్యాంపస్ డ్రైవ్ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. డిజిటల్ ఇండియా కొత్త తరం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు ఎల్లప్పుడూ ఆహ్వానం పలుకుతుందన్నారు. దేశంలో టెక్, నాన్ – టెక్ రంగాల్లో వేగంగా డిజిటలైజేషన్ పెరగడంతో డిమాండ్‌కు అనుగుణంగా ఏడాదికి సుమారు పది లక్షల మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు అవసరమవుతున్నారన్నారు. ఎం.ఎస్.భార్గో ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. హెచ్‌ఆర్ మేనేజర్ బి.దివ్య జ్యోతి మాట్లాడుతూ ఆసక్తి గల విద్యార్థులు ద్వారకా నగర్‌లోని క్యాంపస్‌కి నేరుగా రావచ్చని, లేకుంటే రెజ్యూమ్‌ను పంపవచ్చని తెలిపారు. ఈ డ్రైవ్‌కు రిజిస్ట్రేషన్ ఫీజు లేదని, సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. మరిన్ని వివరాల కోసం 9248753098లో సంప్రదించాలని సూచించారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు



శ్రీలలితాపీఠంలో ఏర్పాటు చేసిన ఉత్తర ద్వార దర్శనం



ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ మండపం

సీతంపేట: ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి సందర్భంగా వైష్ణవాలయాలలో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. వైకుంఠ ఏకాదశి రోజున వైకుంఠ ద్వారాలు తెరుచుకుంటాయని, ఉత్తర ద్వారం ద్వారా మహా విష్ణువు దర్శనం కోసం భక్తులు బారులు తీరుతుంటారు. అందుకు తగినట్టు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాల వద్ద ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అక్కయ్యపాలెం లలితానగర్ శ్రీలలితా పీఠంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి, శ్రీనివాసనగర్‌లో ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణాన్ని పూలదండలు, మామిడి తోరణాలతో అలంకరించారు. ఉదయం 5:30 గంటల నుంచి లలితాపీఠంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. అలాగే ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 6 గంటల నుంచి దర్శనానికి అవకాశం కల్పిస్తామని తెలిపారు.

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని బీజేపీ నాయకురాలు శ్యామలా దీపిక గురువారం సందర్శించారు. ఆయంలో ఉత్తర ద్వార దర్శనానికి సంబంధించిన ఏర్పాట్లపై ఈవో బి.ప్రసాద్‌తో చర్చించారు. అనంతరం ఆమె క్యూలైన్లు పరిశీలించారు.

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీమహా గణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 5 గంటల నుంచి 12 వరకు, సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు దర్శనాలు కల్పిస్తామని ఆలయ సిబ్బంది శివ తెలిపారు.

రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటుకు డిమాండ్



మాట్లాడుతున్న నరవ రాంబాబు, పెదిరెడ్ల రాజశేఖర్

సీతంపేట: సౌత్ కోస్ట్ రైల్వే జోనల్ కార్యాలయానికి ప్రధాని నరేంద్ర మోదీ శంకస్థాపన చేయడంతో ఉత్తరాంధ్ర ప్రజల ఎన్నో ఏళ్ల పోరాటం ఫలించిందని ఉత్తరాంధ్ర బీసీ సంఘాల సమాఖ్య అధ్యక్షుడు నరవ రాంబాబు అన్నారు. లలితానగర్‌లో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైల్వే జోన్ కార్యాలయంతోపాటు రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు, రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్, స్కిల్ ట్రైనింగ్ సెంటర్స్ ఏర్పాటు చేసి ఉత్తరాంధ్ర ప్రజల అభివృద్ధికి దోహదపడాలని కోరారు. సౌత్ కోస్ట్ రైల్వే ఓబీసీ సంఘాల అధ్యక్షుడు పెద్దిరెడ్ల రాజశేఖర్ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో వేల మంది నిరుద్యోగులు ఉపాధి లేక మగ్గిపోతున్న తరుణంలో సౌత్ కోస్ట్ రైల్వే కార్యకలాపాల ప్రారంభంతో వారికి ఊపిరి పోసినట్టుగా ఉందన్నారు. వేల సంఖ్యలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

శ్రీవారి ఆలయానికి భారీగా వెండి ఆభరణాలు



వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తుల కోసం వెండి ఆభరణాలు అందిస్తున్న భక్తులు



పద్మావతి అమ్మవారికి తయారు చేయించిన వెండి చీర అందజేస్తున్న భక్తులు

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ సెక్టార్ – 6లోని శ్రీ వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో ధనుర్మాస మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి స్థానిక భక్తులు భారీగా వెండి ఆభరణాలు సమర్పించారు. శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు 8 కేజీల వెండితో తయారు చేయించిన సర్వాంగ కవచాలు సమర్పించారు. దీంతోపాటు శ్రీ పద్మావతి అమ్మవారికి 5 కేజీల వెండితో అద్భుతంగా తయారు చేయించిన చీర, పాదాలు అందజేశారు. ఆలయ ధర్మకర్త ప్రసాదరావు, అర్చకులు లక్ష్మణస్వాములకు ఈ ఆభరణాలను భక్తులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గ సభ్యులు గౌరీశంకర్, లక్ష్మీనారాయణ, జగన్, మూర్తి తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనం కోసం వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని కార్యవర్గ సభ్యులు తెలిపారు.

వేడుకగా సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

సీతంపేట: స్థానిక మధురానగర్‌లో గల టైనీటాట్స్ స్కూల్‌లో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పల్లెల్లో సంక్రాంతి ఎలా నిర్వహిస్తారో కళ్లకు కట్టేలా చూపారు. పిల్లలకు పండగ విశిష్టత తెలిపేలా రంగవళ్లులు, పొంగళ్లు, భోగి మంటలు వేసి ఉత్సాహంగా జరిపారు. ఈ సందర్భంగా పిల్లలు హరిదాసు, వినాయకుడు, కోడిపుంజు, రైతులు, సోదమ్మ వేషాల్లో అలరించారు. పాఠశాల హెచ్‌ఎం నరేంద్రకుమార్ కాంబోజ్, గీతా కాంబోజ్ పాల్గొన్నారు.

శ్రీలలితాపీఠం ఉత్తరాధికారికి ఘన స్వాగతం



శ్రీలలితాపీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామితో అర్చకులు, కృష్ణసేన్

సీతంపేట: కుర్తాళం శ్రీసిద్ధేశ్వరి పీఠం, విశాఖ శ్రీలలితాపీఠం ఉత్తరాధికారిగా ఇటీవల నియమితులైన దత్తేశ్వరానంద భారతీ స్వామి గురువారం సాయంత్రం మొదటి సారి అక్కయ్యపాలెం లలితాపీఠానికి విచ్చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో, మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం పీఠంలోని గోశాలను సందర్శించారు. పురోహితులు, వేద పండితులను పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఉత్తరాధికారికి పరిచయం చేశారు. వారిని ఆశీర్వదిస్తూ పండ్లు అందజేశారు. ఉత్తరాధికారి నెల రోజుల పాటు పీఠంలో ఉంటారని, విశేష పూజా కార్యక్రమాల్లో పాల్గొంటారని కృష్ణసేన్ తెలిపారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ పరీక్షలు



కైలాసగిరి పోలీస్ మైదానంలో అభ్యర్థులకు సూచనలిస్తున్న అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా

ఆరిలోవ : కైలాసగిరి ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో చేపడుతున్న కానిస్టేబుళ్ల నియామక పరీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం ఎనిమిదో రోజు శరీర దారుఢ్య పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షలకు 600 మందికి 304 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 237 మంది తదుపరి పరీక్షలకు అర్హత సాధించినట్లు అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఈ పరీక్షలను ఎస్పీతోపాటు అడిషనల్ ఎస్పీ ఎల్.మోహన్‌రావు, అనకాపల్లి సబ్ డివిజినల్ డీఎస్పీ ఎం.శ్రావణి, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ టి.లక్ష్మి, సైబర్ ఇన్‌స్పెక్టర్ టి.కళ్యాణి, ఆర్ఐ రామకృష్ణ, ఎస్ఐ సురేష్‌బాబు పర్యవేక్షించారు.

పాలిటెక్ ఫెస్ట్‌లో అవార్డు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు

మురళీనగర్: సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 6, 7న విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పాలిటెక్ ఫెస్ట్ – 2025లో కంచరపాలెం గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ మెటలర్జికల్ ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్నారు. ఈ కాలేజీకి చెందిన సాయి రోహిత్, ముఖేష్ సాయిరాం ప్రదర్శించిన "3 – ఈ ప్రింటింగ్ ద్వారా కృత్రిమ ఎముకల తయారీ" ప్రాజెక్ట్‌కు రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం లభించింది. ఈ మేరకు వీరికి మంత్రి నారా లోకేష్ బహుమతి అందించారు. విద్యార్థులకు లెక్చరర్లు డాక్టర్ రమేష్, వెంకటేశం, రాజేంద్ర బాబు మార్గదర్శకత్వం వహించారు. ఈ మేరకు కాలేజీలో గురువారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు విద్యార్థులతోపాటు గైడ్ టీచర్లను అభినందించారు. సమావేశంలో మెటలర్జీ విభాగాధిపతి డాక్టర్ రత్న కుమార్, స్టూడెంట్స్ అడ్వైజర్ ఎస్‌వీ రమణ, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

సనాతన ధర్మం బోధించడమే లక్ష్యం



గురుపూజా మహోత్సవాల వేదిక

తాటిచెట్లపాలెం: సనాతన ధర్మాన్ని బోధించడం, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడమే గురుపూజోత్సవాల పరమావధి అని జగద్గురుపీఠం కార్యనిర్వాహక సభ్యులు చింతలపాటి సత్యదేవ్, అజ్జరపు శ్రీనివాస్ తెలిపారు. జగద్గురు పీఠం ఈ నెల 11, 12, 13న జిల్లా పరిషత్ సమీపంలో గల ఆంకోసా ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో 64వ మాస్టర్ సీవీసీ గురుపూజా మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. మూడు రోజులపాటు జరిగే కార్యక్రమాల వివరాలను తాటిచెట్లపాలెంలో గల జగద్గురుపీఠం కార్యాలయంలో చింతలపాటి సత్యదేవ్ గురువారం తెలియజేశారు. గురుపూజా మహోత్సవాల్లో దేశవ్యాప్తంగా, స్పెయిన్, జర్మనీ, స్విట్జర్లాండ్ దేశాల నుంచి సుమారు రెండు వేల మంది సాధకులు, విదేశీయులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ మూడు రోజులు ఉదయం, సాయంత్రం వేళల్లో గురు ప్రార్థనలు, రుద్రాభిషేకం, సామూహిక లలితా సహస్రనామ పూజ, లక్ష్మీనారాయణ పూజ, నారాయణ హోమం నిర్వహించనున్నామని తెలిపారు. పూజా మహోత్సవాల సందర్భంగా కులపతి బుక్ ట్రస్ట్ ప్రచురించిన మాస్టర్ ఇ.కె.లలితా సహస్రనామ రహస్య ప్రకాశం, బుక్ ఆఫ్ రిచ్యువల్స్, మాస్టర్ ఇ.కె.ఐరోపా పర్యటన, తైత్తిరియోపనిషత్‌లను, ధనిష్టా ఫౌండేషన్ ముద్రించిన మాస్టర్ పార్వతీకుమార్ రచించిన భారతీయ సంప్రదాయం, అక్కల్ట్ మెడిటేషన్స్ అనే రెండు పుస్తకాలు కూడా ఆవిష్కరించనున్నట్లు సత్యదేవ్ తెలిపారు. ఉత్సవాలలో ప్రముఖుల ప్రసంగాలు ఉంటాయని తెలిపారు.

ఆరు నెలలకోసారి రక్తదానంతో ఆరోగ్యానికి మేలు



విమ్స్‌లో రక్తదాన శిబిరంలో దాతలు, డైరెక్టర్ డాక్టర్ రాంబాబు, తదితరులు

ఆరిలోవ : రక్తదానం ప్రాణాలను కాపాడుతుందని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు తెలిపారు. విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విమ్స్ సిబ్బంది రక్తం అందించడానికి ముందుకొచ్చారు. ఇక్కడ ఇటీవల బ్లడ్ బ్యాంక్ అందుబాటులోకి వచ్చింది. అందులో నిల్వ చేయడానికి అవసరమైన రక్తం కోసం విమ్స్ అధికారులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన డైరెక్టర్ రాంబాబు రక్తదాతలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరానికి రక్తం లభ్యం కాకపోవడంతో చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రతి ఆరు నెలలకు ఓసారి రక్తదానం చేయవచ్చన్నారు. దానివల్ల శరీరానికి మేలు జరుగుతుందన్నారు. కొత్త రక్తం చేరి శరీరంలో ఉత్తేజం కలుగుతుందన్నారు. రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడడంతోపాటు రక్తం ఇచ్చిన వారు కూడా ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో విమ్స్ కార్యాలయం పర్యవేక్షణాధికారి సత్యనారాయణ, పరిపాలనాధికారి షేక్ బాజీ, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.